www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 జులై 2024
5
వైఎస్ఆర్



'సీమ' ప్రజల జీవితాన్ని చదివిన రచయిత 'కేతు'

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయలసీమ ప్రజల జీవితానికి విశిష్ట పట్టిన రచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి అని కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బుధవారం సి.కె.సంపత్ కుమార్ పఠన మందిరంలో ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి 86వ జయంతిని నిర్వహించారు. కేంద్రం ఉద్యోగులు, పాఠకులు కలిసి ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భూతపురి మాట్లాడుతూ కథకునిగా, విద్యావేత్తగా, సాహిత్య విమర్శకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులన్నారు. ఆయన కడపజిల్లా కమలాపురం మండలంలోని రంగసాయిపురంలో జన్మించారని, ఆయన మొదటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథంతో మానవ సంబంధాలను విశ్లేషించి రచనలు చేశారన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

సౌత్ జోన్ హాకీ పోటీల ప్రారంభోత్సవంలో క్రీడా శాఖ మంత్రి 'మండిపల్లి'



హాకీ ఆడుతూ క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తామని, క్రీడా శాఖలో ఉన్న దొంగ సర్టిఫికెట్లను రూపుమాపుతామని రాష్ట్ర క్రీడా శాఖ, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ హాకీ క్రీడా మైదానంలో సౌత్ జోన్-2 హాకీ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు క్రీడా సంఘ సభ్యులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. క్రీడాజ్యోతి వెలిగించి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం హాకీ స్టిక్‌తో బాలును కొట్టి క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో కేరళ, తమిళనాడు, తెలంగాణా, ఎపి, పుదుచ్చేరి, కర్నాటక నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలు ఈనెల 17 వరకు నిర్వహిస్తారు. చివరి రోజు విజేతలకు మెడల్స్, కప్పు, మెమోంటోలతోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. విద్యతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని, ప్రతి ఉద్యోగంలో స్పోర్ట్స్ కోటా కూడా ఉంటుందని చెప్పారు. సర్టిఫికెట్లతో ఎంతోమంది ఉద్యోగాలు కూడా పొందారని అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రి ఎవరో కూడా తెలియని పరిస్థితి మనకు ఉండేదని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో సుమారు రూ.130 కోట్లు క్రీడల కోసం దుర్వినియోగం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో క్రీడల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేద క్రీడాకారులకే ఉపయోగిస్తామని ఒక్క రూపాయిని కూడా దుర్వినియోగం చేయమని చెప్పారు. 22 మంది కోచ్‌లకు సుమారు ఏడు నెలలు వేతనాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టిందని పేర్కొన్నారు. తాము వచ్చిన 35 రోజుల లోపల వారికి జీతాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం క్రీడలపై యువత ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని, వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా అన్ని చర్యలు చేపడతామని అన్నారు. ఇటీవల తార ఒలింపిక్స్‌లో కూడా ఆంధ్రప్రదేశ్ సంబంధించిన ఎంతోమంది ఎక్కడికి వెళ్లి పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి తప్పులు జరగకుండా క్రీడాకారులకు మంచి నైపుణ్యాన్ని అందించడం లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఉద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా క్రీడలకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాను కూడా తీసుకొని వచ్చి మరింత క్రీడలను అభివృద్ధి చేస్తామని అన్నారు. క్రీడలకు సంబంధించి దొంగ సర్టిఫికెట్ల సంగతి తేలుస్తానని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలో కమిటీని వేస్తామని, ఈ సర్టిఫికెట్లు తీసుకొని కొంతమంది ఉద్యోగాలు కూడా చేస్తున్నారని వారి భరతం పడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవసరమైన ప్రతి చోటా క్రీడామైదానాలు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో రెండోసారి హాకీ క్రీడలు జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరిన్ని క్రీడలు ఇక్కడ జరిగే విధంగా చూస్తామని అన్నారు. తాము చదువుకునే రోజుల్లోనూ హాకీ ఆడేవారమని చెప్పారు. వివరాల మంత్రిని, ఎమ్మెల్సీ భూమిరెడ్డి, పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవిని క్రీడా సంఘ సభ్యులు సత్కరించి పూల బొకేలను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హాకీ సిఇఒ నిరంజన్‌రెడ్డి, సెక్రెటరీ హర్షవర్ధన్, ట్రెజరర్ థామస్ పీటర్, కడప హాకీ సెక్రటరీ శేఖర్, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా క్రీడాకారులు

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ధర్నాలో సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -కడప అర్బన్

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ. 26 వేల జీతం పెంచి, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌లో కడపలో స్టీల్ ప్లాంట్‌ఏర్పాటు చేయాలని ఉందని గుర్తు చేశారు. వాటి ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగుల ద్వారా అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా పని చేయడం దారుణమని తెలిపారు. దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నీ ప్రయివేటీకరించడం వారి చేతగాని తనానికి నిదర్శనం అని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, విద్యుత్, ఆశా, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ అప్కాస్ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని చెప్పారు. అంగన్వాడీలు మధ్యాహ్న భోజనం, సర్వ శిక్ష ,విద్య, వైద్య రంగంలో పనిచేసే వారందరికి జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కలిగించాలన్నారు. ఆటో హమాలీ, భవన, తోపుడు బండ్లు తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మెడికల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర నారాయణ, మున్సిపల్ జిల్లా కోశాధికారి ఎస్. గోపి, నగర అధ్యక్షులు ఎస్.రవి, ప్రకాష్, కిరణ్, శ్రీధర్, నాగరాజు, రవి మున్సిపల్ కార్మికులు నాయకులు, ఐఎంఎల్ కార్మికులు, ఉదయ్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని, వెంటనే రద్దు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, విజయ్ కుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవ, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి బాలసుబ్బయ్య, ప్రమీలమ్మ, నీతమ్మ, రమాదేవి, మెడికల్ రేప్స్ యూనియన్ నాయకులు జెకె సునీల్ రెడ్డి, హెచ్ రెడ్డయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాపాడాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దాసరి విజయ్, జి ఏసుదాసు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం సిఐటియు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా పట్టణంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిఐటియు పట్టణ కమిటీ ధర్నా నిర్వహించింది. అనంతరం ఆర్‌డిఒ ఎ. శ్రీనతివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆదాము, దివాకర్, శేఖర్, శివ, దస్తగిరి, విజయ్, నన్నే , నరసింహ, మణి, సుబ్బయ్య, చెన్నయ్య, మారి, మున్న, వినయ్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళ చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం, ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్‌తో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం అంగన్వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపుల ఆపాలని చెప్పారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, నగర కార్యదర్శి అంజనీదేవి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలకు జీవోలు విడుదల చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీ ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని చెప్పారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లకుండా సర్క్యులర్ ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌డిఒ వెంకటపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ. ఎన్. సుబ్బమ్మ, నాయకులు వసుంధర, కవిత, పోలమ్మ, సునీత, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు తగవు

ముద్దనూరు : అంగన్వాడీలపై రాజకీయ నాయకుల వేధింపులు తగవని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి అన్నారు. అంగన్వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం సిడిపిఒ ముంతాజ్ బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొండాపురం మండలంలో కొంతమంది రాజకీయ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలను తొలగించి వారికి అనువైన వారిని నియమించుకోవడం కోసం ప్రస్తుత టీచర్లను వేధించడం అన్యాయం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని చెప్పారని, ఇప్పుడు కొన్ని చోట్ల టీచర్లను వేధించడం సరికాదని వాపోయారు. 42 రోజులు సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలు అంగీకరించిన అంశాలకు జీవో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళావతి, వరలక్ష్మి ,కుష్మ, ప్రమీల, హైమావతి, పద్మావతి పాల్గొన్నారు.



ముద్దనూరు సిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న కలెక్టర్ శివశంకర్

- మధ్యాహ్నం భోజనంలో ఉడకని కర్రీపై అసంతృప్తి
- సైన్స్ ఉపాధ్యాయుడిపై ఆగ్రహం
- జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - కాశినాయన

పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి 100 శాతం ఫలితాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను మండల అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బాల ఓబయ్య బోధించే బయాలజికల్ సైన్స్ క్లాస్‌లో విద్యార్థుల మధ్యలో కూర్చుని ఆయనబోధించే పాఠ్య బోధనను విన్నారు. ఆ ఉపాధ్యాయుడు సరిగ్గా చెప్పడం లేదని గ్రహించిన కలెక్టర్ 'విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ముందు పూర్తిగా ప్రిపేర్ అయ్యి రావాలి కదా.. ఇలా చెప్తే విద్యార్థులకు ఏమి అర్థం అవుతుంది' అని సంబంధిత ఉపాధ్యాయుడుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బోధించే ముందు ఉపాధ్యాయులందరూ పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై ముందస్తుగా ప్రిపేర్ అయ్యి విద్యార్థులకు బోధించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి జీవిత ఆశయ వివరాలు అడిగి తెలుసు కున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిర్విరామంగా కృషి చేయాలన్నారు .క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచిస్తూ, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం స్వయంగా ఆయన పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. బంగాల దుంప కర్రీ సరిగా ఉడకలేదని సంబంధిత ఇన్‌ఛార్జిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుండి పద్ధతులు మార్చుకొని పిల్లలకు అందించే భోజనంలో మంచి ఆహారం అందించకపోతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టాఫ్‌రూంలో టీచర్‌లతో సమావేశమై పాఠశాలలో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం తీసుకోవాలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు అనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను సందర్శించి అక్కడ పనిచేసే సిబ్బందికి తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలను ఆలస్యం లేకుండా అందించాలని ఆదేశించారు కార్యక్రమంలో జడ్‌పి హైస్కూల్ హెడ్మాస్టర్, మండల రెవెన్యూ అధికారి,మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలే లక్ష్యం

ప్రజాశక్తి-చెన్నూరు : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలను బుధవారం శాసనసభ్యులు సందర్శించారు. జూనియర్ కళాశాల బాలికల ఉన్నత పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఉపాధ్యాయుల పనితీరుపై ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు స్టూడెంట్ కిడ్స్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువులో రాణించాలని విద్యార్థులను కోరారు. పాఠశాలలో పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు గంగిరెడ్డి, సునీత, హెచ్‌ం రత్నదేవి, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యంశర్మ, తహశీల్దార్ ప్రకాష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి -గోపవరం : జిల్లా కోర్టు ఆదేశాల మేరకు గోపవరం మండలం బుచ్చిన పల్లె గ్రామంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కోర్టు భవనాలు బద్వేలు వారి ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. గాయత్రి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బ్రహ్మారెడ్డి, రమణారెడ్డి, న్యాయవాదులు పాల్గొని మాటల్లాడారు. మంచితనం మానవత్వంతో జీవనం సాగించాలని, గ్రామస్తులందరూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని వారిని అభినందించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

వాట్సాప్ ద్వారా సమస్యలకు పరిష్కారం : విద్యుత్ ఎస్ఇ

కడప : ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సంస్థలో సంస్కరణలు అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. ఇందులో భాగంగాప్రజలు వ్యయ ప్రాసలకు గురికాకుండా వాట్సప్ ద్వారా వాలిపోయిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు వంటి విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. బుధవారం కడప విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సమస్యలకు సంబంధించిన ఫొటోలు ఫిర్యాదు దారుని పేరు, గ్రామం, మండలం, వారి మొబైల్ నెంబరు, వాట్సాప్ నెంబర్ 9440814264కు పంపితే హెల్ప్ డెస్క్‌లో ఉన్నటువంటి సిబ్బంది సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారం అయ్యేవరకు అనుసరిస్తారని తెలియజేశారు. సమస్య తీవ్రతను బట్టి సకాలంలో పరిష్కరిస్తామని చెప్పారు. వినియోగదారునికి సేవలు అందించుటలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ నాయకులు

కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ ఆధ్వర్యములో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శివశంకర్ లోతేటిను బుధవారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అందరం కలిసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూద్దామన్నారు. ఉద్యోగుల సమస్యలుంటే నేరుగా రండి పరిష్కరించుకుందాం అన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, బాలపులయ్య, రాజశేఖర్, పోల్ రెడ్డి, నరసింహ రెడ్డి, సిటీ, అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వేర్ రెడ్డి, మహిళా ఎన్‌జిఒ నేతలు గౌరీ, జ్యోతి, సుహాసిని, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. సిఐటియు అఖిలభారత కమిటీ పిలుపుమేరకు బుధవారం కోరికల దినోత్సవంలో భాగంగా కడప నగరంలోని విద్యుత్ భవన్ దగ్గర ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్ భవన్ కార్యాలయం పిఒ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ చేసి వేతనం ఇవ్వాలని కోరారు. కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లకు సమానంగా జీవితాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్ మెన్‌ను నియమించాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25 సంవత్సరాలుగా విద్యుత్ కార్మికులు పనిచేస్తున్న విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఆలోచనచేసి విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కార్మికులకు ఇల్లు, వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని పేర్కొన్నారు. పై డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్ల జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుదర్శన్ రెడ్డి, డిస్కం సెక్రటరీ శివశంకర్, జిల్లా కమిటీ సభ్యులు సురేంద్రబాబు, కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులనాయకులు కొండయ్య, రంగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డి గోపాల్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి

ప్రజాశక్తి - కడప :వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ ఇన్‌ఛారి సెక్రటరీ కె. ప్రత్యూష కుమారి అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 'హెల్మెట్ ధరించండి ప్రమాదాలను నివారించండి' మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన దారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని గుర్తించుకోవాలి అని చెప్పారు. వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులకు క్షేమమని తెలిపారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించి గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు.

వరి సాగులో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - వల్లూరు : వాతావరణం మార్పు వల్ల వరి పంటలో ఉల్లి కోడు తగలకుండా వరి నాటిన 20 రోజుల తర్వాత ఫ్రీప్రోనేల్ గుళికలు ఎకరాకు 8 కేజీలు చొప్పున వేసుకున్నట్లయితే ఉల్లి కోడ్‌తో పాటు కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగును నివారించవచ్చని కమలాపురం వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డి తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని తప్పెట్ల గ్రా మంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ జిల్లా వర్క్ షాపును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కడప జిల్లా వర్క్ షాప్ ఈనెల 17న బద్వేల్ పట్టణంలో నిర్వహిస్తామని జిల్లాలోని డివైఎఫ్ఐ, యువజన రంగం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని వీరనాల. శివకుమార్ తెలిపారు. బుధవారం కడపలో స్థానిక యుటిఎఫ్ భవన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి డివైఎఫ్ఐ నాయకత్వం హాజరవుతారన్నారు. ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం చర్చిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందిన కోసం ఈ వర్క్ షాప్ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరపోగు రవి, సహాయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక గాంధీనగర్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 900 మంది విద్యార్థులు ఉంటే అందుకు సరిపడ ఉపాధ్యాయులు లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు పంపిణీ చేస్తున్న విద్యా కిట్లు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అలాగే విద్యార్థులకు సరైన నీటి సదుపాయం లేదన్నారు. విద్యార్థులు ఉండే గదులలో, పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థులు ఆడు కోవడానికి స్వేచ్ఛ ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సమస్యలపై వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి

బలవంతపు రాజీనామాలు వద్దు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో రేషన్ షాప్ డీలర్లపై బలవంతపు రాజీనామాలు చేయించడం అధికారులకు తగదని వైసిపి మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపిపి అరుణ అధ్యక్షతన ఎంపిడిఒ సల్మాన్‌రాజ్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రేషన్ షాప్ డీలర్ల రాజీనామాలపై అధికారులు బలవంతపు చర్యలకు దిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య పనులపై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. అతిసార వ్యాధి ప్రబలకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ భీమేశ్వరరావు, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి, ఇతర శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నగర పంచాయతీలో పని చేసే ప్రతి ఒక్కరూ సమయపాలన తప్పకుండా పాటించాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం ఆయన ఎలక్ట్రీషియన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జమ్మలమడుగు నగర పంచాయతీలో మొత్తం 3,440 వీధి దీపాలు ఉన్నాయన్నారు. ముద్దనూరు, ప్రొద్దుటూరు, తాడిపత్రి రహదారుల ప్రధాన రోడ్లలో వీధిదీపాలు రాత్రిపూట ప్రతిరోజూ వెలగాలన్నారు. లైట్లు వేయడంలో అలసత్వం వీడి సమయానికి వెలిగేలా పనిచేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ప్రజాఫిర్యాదులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో డిఇ బాల మల్లేష్, ఎలక్ట్రీషియన్స్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

దోమకాటుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

దోమకాటుకు దూరంగా ఉంటే వ్యాధులు రావని, అందుకు తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. మలేరియా శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల్లో ఉన్న విద్యార్థులు అనారోగ్య పాలుకాకుండా ఉండేందుకు దోమల నివారణ ఆల్ఫాసైపర్ మందును పిచికారి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి మనోహర్ ఆదేశాల మేరకు నియోజక వర్గంలోని ప్రతి వసతి గృహం వెళ్లి దోమల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగసర్ప, హాస్టల్ ఎస్ఎంఒ అరుణ, ఆశా కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.


పాఠశాలలో మందు పిచికారి చేయిస్తున్న సిద్దయ్య

డెంగీపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

డెంగీ మాసోత్సవం సందర్భంగా బుధవారం నగర పంచాయతీ పరిధిలో సబ్ యూనిట్ ఆరోగ్య అధికారి లక్ష్మయ్య డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, తెట్టెదారాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రత ప్రాంతాల్లో దోమ లార్వాలను నియంత్రించే చర్యలు తీసుకోవాలన్నారు. దోమ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టాలని సూచించారు. దోమతెరలు, వేపాకుతో పొగ, పొడవాటి దుస్తులు వేసుకోవాలని, జ్వరాలు వంటి వ్యాధులు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఓబులేసు, జయపాల్, సునీల్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 240 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో 240 మంది ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపల్ టి.నవరూప కుమార్ తెలిపారు. ఇందులో 111 మంది అమర్ రాజ కంపెనీ చిత్తూరుకు, 50 మంది గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నాయుడుపేటకు, 19 మంది న్యూ హాలండ్ ట్రాక్టర్స్ అండ్ హార్వెస్టర్స్ ప్రొద్దుటూర్‌కు, 60 మంది ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కొప్పర్తి కడపకు ఎంపికయ్యారని తెలిపారు. జాబ్‌మేళాకు 300మంది వచ్చారన్నారు. ఉద్యోగాలు పొందిన వారికి ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు. ఎంపిక చేసిన కంపెనీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మున్సిపల్ పరిధిలోని దొండపాడు రస్తాలో మురికికాలువల్లో పూడికతీత పనులు మున్సిపల్ అధికారులు చేపట్టారు. దీనిపై ఇటీవల జనసేన పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ ప్రత్యేక చొరవ తీసుకొని అధికారులతో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు పనులను ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు బత్తల నాగరాజు, భాస్కర్, పవన్‌కుమార్, శివ పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో భారీ మోసం

తూకాలు తక్కువగా ఉంటే వెనక్కి పంపండి : ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలో పౌర సరఫరా శాఖ ద్వారా రేషన్ సరఫరా చేస్తున్న గుత్తేదారులు తక్కువ తూకాలు ఇచ్చి భారీ మోసం చేస్తున్నారని, తూకాలు తక్కువగా ఉంటే వెనక్కి పంపాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని రేషన్ గోడౌన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న బియ్యం బస్తాలను తూకాలు వేయించగా, ప్రతి బస్తాలో కిలో నుంచి ఒకటిన్నర కిలో వరకు తూకాలు తక్కువగా వచ్చాయి. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రేషన్ సరఫరా చేసే సంస్థలు తక్కువ తూకాలతో పంపడం జరుగుతుందని, గత ఐదు సంవత్సరాల నుంచి పౌర సరపర శాఖలో భారీగా మోసాలు జరిగాయన్నారు. రేషన్ డీలర్లు తక్కువ తూకాలు ఉంటే తీసుకోకూడదని ఈ విషయాన్ని అధికారులు లేదా తన దృష్టికి తెస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తాం

పులివెందులలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి కల్పనకు ప్రయత్నిస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం నూతన భవనాలను నిర్మించింది కానీ, యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందన్నారు. దీని ద్వారా పులివెందుల ప్రాంతానికే కాకుండా రాయలసీమ ప్రాంతం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వీలుగా అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైసూరారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.


గోడౌన్‌లో తూకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందాం : ఎమ్మెల్యే



ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమాయత్తం అయ్యారు. బుధవారం మైదుకూరు మున్సిపల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మైదుకూరు-నంద్యాల రోడ్డుకు సంతను మారుస్తూ కౌన్సిల్ తీర్మానం ఆమోదం తెలపాలని కౌన్సిలర్ సుమలత కౌన్సిల్ ముందుకు తీసుకురాగా, మెజారిటీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. పశువుల సంతను పాతచోట నంద్యాల రోడ్డులో ఏర్పాటు చేసి, బద్వేల్ రోడ్డు సంత స్థానంలో ప్రభుత్వ గోదాములు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కడప రోడ్డు పెట్రోల్ బంక్ వంకను ఆక్రమించారని, స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కౌన్సిలర్ సుమలత సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే వదిలే ప్రసక్తే లేదు : 'పుట్టా'

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా తప్పు చేస్తే, అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. మైదుకూరు మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపిపి థామస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కష్టపడి మండలాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. వైసిపి ప్రభుత్వంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులకు విలువలేదన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి విలువ ఉంటుందని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా అర్హతలేని వారికి పెన్షన్లు వచ్చాయని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిలో బోగస్ మస్టర్లు తయారు చేసినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి కూలీలకు తప్పనిసరిగా 100 రోజులు పని దినాలు చూపించాలని అధికారులకు సూచించారు. ఒకే విధమైన శ్మశాన వాటికలు అన్ని గ్రామాల్లో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు తమ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులను నివేదిక రూపంలో చదివి వినిపించారు. సమావేశంలో జడ్‌పిటిసి ఎ.ప్రసన్నలక్ష్మి, ఎంపిడిఒ ఎం.ఫజుల్ రహిమాన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అందజేసే కౌలు రైతు గుర్తింపు కార్డులను వారు తప్పక పొందాలని తహశీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆయన కౌలు రైతుల గుర్తింపు కార్డులపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2024-25 ఏడాదికి సంబంధించిన ఖరీఫ్ పంట సాగు చేసే కౌలు రైతులు రెవెన్యూ అధికారులు జారీ చేసే గుర్తింపు కార్డులను తీసుకోవాలని సూచించారు. కౌలు గుర్తింపు కార్డులు తీసుకున్న రైతులకే పట్టాదారులతో సమానంగా కౌలు రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేస్తారన్నారు. పంట నమోదు అయితేనే ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి అర్హులన్నారు. కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు భూ యాజమాని పాసు పుస్తకం జిరాక్స్, భూ యాజమాని ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డు జిరాక్స్, పాసుపోర్టు సైజ్ ఫోటోలు, మొబైల్ నెంబర్ తీసుకొని గ్రామ రెవెన్యూ అధికారిని గాని రైతుసేవా కేంద్రం సిబ్బందినిగానీ సంప్రదించాలని కోరారు. కౌలు రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా కౌలు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.


రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తాహశీల్దార్ వెంకటేష్ నాయక్

విద్యుత్ ఛార్జీలపై టిడిపి ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యుత్‌పై శ్వేత పత్రం విడుదల చేసిన రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుతారా లేక తగ్గిస్తారా, అలాగే ఉంచుతారా అనే దానిపై ప్రజలకు స్పష్టతనివ్వాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రం ఆత్మస్తుతి, పరనిందలతో కూడి ఉందని విమర్శించారు. గతంలో చంద్రబాబు చేసిన ఘన కార్యాన్ని, జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చెప్పడం తప్ప భవిష్యత్తులో చేయ బోయే వాటిపై స్పష్టత లేదన్నారు. 2024 ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలు పెంచం, వ్యవసాయ మోటర్లుకు మీటర్లు అమర్చడాన్ని ఉప సంహరించుకుంటామని కూటమి నాయకులు చెప్పారన్నారు. కాని శ్వేత పత్రంలో మాత్రం ఈ విషయంపై స్పష్టత లేదన్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.17,137 కోట్లు టారీఫ్ ఛార్జీల కింద వినియోగదారుల నుంచి రాబట్టేందుకు అనుమతినివ్వమని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు నివేదికలు సమర్పించినట్లు చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు మీటర్లుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తల్లికి వందనం పేరుతో తల్లులకిచ్చే రూ.15వేలను ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని తీవ్రనష్టం కలిగించే జిఒనెం.117ను రద్దు చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా జిఒనెం.117ను రద్దు చేస్తామని విద్యాశాఖామంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాం తరంగా కొనసాగించాలన్నారు. సిబిఐటి, ఐబి, టోఫెల్ సిల బస్‌ను ఉపసం హరించుకోవాలన్నారు. బోధనకు ఆటంకం కలిగించే అనవసర యాప్‌లను తొలగించాలన్నారు. అన్ని రకాల పదోన్నతులు వెంటనే చేపట్టాలని శ్యాంసుందర్‌రెడ్డి కోరారు.

కాలేజీ, పశువుల ఆస్పత్రి నూతన భవనంలోకి మార్చాలి

కొండాపురం : గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన కొండాపురంలో ఉన్న పశువుల ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కాలేజీని నూతన బైపాస్‌లో ఎంపిడిఒ కార్యాలయ పక్కన నూతన భవ నంలోకి మార్చాలని సిపిఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు కోరారు. ఆయన బుధ వారం ఎంపి డిఒ నాగప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పశువుల ఆస్పత్రి పాత గ్రామం లో ఉండడం వల్ల పశువులు, జీవాల పెంపకం దారులు చాలా ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. సిపిఐ నియోజకవర్గ కార్య దర్శి ఎంవి సుబ్బారెడ్డి, ఎ.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

ఏలూరు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన భూమిరెడ్డి సాయి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తనయుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఏలూరులోని ఎంపీ స్వగృహంలో బుధవారం ఆయన వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పులివెందుల, సింహాద్రిపురం మండలాల టిడిపి యువత పాల్గొన్నారు.



నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను బుధవారం విజయవాడలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రస్తావించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎన్నో కష్టాలకోర్చి పార్టీ జెండాను నిలబెట్టిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి, అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రవీణ్ కోరారు. బిసి నేత నందం సుబ్బయ్య హత్య కేసులో నిజమైన దోషులు బయటికి వచ్చేలా సిఐడికి కేసును అప్పగించాలని మంత్రి లోకేష్‌ను కోరారు.


లోకేష్‌కు సమస్యల పత్రాన్నిస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

వేంపల్లి-రాయచోటి ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మండల టిడిపి నాయకులు వినతిపత్రమిచ్చారు. నాలుగేళ్లుగా పనులు నత్తనడక సాగుతున్నాయని తెలిపారు. అసంపూర్తి పనులు వల్ల వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ దారి నుంచి మంత్రి పులివెందులకు వెళుతున్న సందర్భంగా నాయకులు పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవితో కలిసి వినతిపత్రమిచ్చారు. మండలంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు నాగలగట్టుపల్లె, చక్రాయపేటలో వారికి ఘనస్వాగతం పలికారు. బాణసంచా పేల్చుతూ, శాలవాలు కప్పి ఘనంగా సన్మానించారు.


మంత్రికి ఘన స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

వేంపల్లె : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి బుధవారం మండల టిడిపి నేతలు ఘన స్వాగతం పలికారు. పులివెందుల నుంచి కడపకు వెళుతుండగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మంత్రిని, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి టిడిపి నాయకులను మంత్రితో పరిచయం చేశారు. నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, పూల అల్లాబకష్, సంటెన్న, నాగభూషణం, భాస్కర్, శ్రీరామిరెడ్డి, వెల్డింగ్ బాషా, గోగుల మల్లికార్జున, పక్కీర్ పల్లె లాడెన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రంథాలయ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్ అమీరుద్దీన్ తెలిపారు. గ్రంథాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. శాఖా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. సభ్యత్వాల సంఖ్య పెంచాలని సూచించారు. పంచాయతీ నుంచి గ్రంథాలయానికి రావాలసిన పన్ను బకాయిలు, అభివృద్ధి, పాఠకుల సంఖ్య మొదలగు వాటి మీద దృష్టి పెట్టాలని అధికారికి సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె. శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.